
సీరియల్ కథ

# వసంతం వచ్చింది!!



(గత సంచిక తరువాయి)

రచన : "శ్రీ కేశ్"

"సర్....వెళ్దామా?" అంటూ పిలిచాడు రాఘవ్ వసంత్‌ను.

"అలాగే, వెళ్దాం పద." అంటూ నడిచాడు వసంత్.

అలా వెళ్ళి ఎస్టేట్ అంతా చూసి "అబ్బా....ఎంత పెద్దది, ఆ కాటేజెస్ ఎందుకు?" అంటూ అడిగాడు వసంత్.

"సర్....ఆ ఎస్టేట్ విలువ దాదాపు కోటిన్నర వుంటుంది. ఇది హైదరాబాద్‌కు దూరం ఉండి, చల్లగా-ప్రశాంతంగా ఉండడం ద్వారా ఇది అందరినీ ఆకర్షిస్తుంది. కారణం కాశ్మీరుకు, ఊటికి దగ్గరి పోలిక లుండటమే! ఇందులోవున్న ఆ కాటేజ్‌లు వాటివల్ల సంవత్సరానికి 8 లక్షల ఆదాయం వస్తుంది. ఈ కొబ్బరి చెట్లవల్ల 2 లక్షలు, ఇంకా యితరు 2 లక్షలు మొత్తం దాదాపు పన్నెండు, పదువాల్గు లక్షల వరకు వస్తుంది. ప్రస్తుతం కొందరు పేట్ప్ దీనిని 3 కోట్లకయినా కొనడానికి సిద్ధంగా ఉన్నారు."

ఆ మాటలు విని వసంత్ ఆశ్చర్యంతో "అలాగా.... ఇంత ఆదాయం ఎలా వస్తుంది? ఎవరు వస్తారు?...." అన్నాడు.

"సర్ విదేశస్తులు హైదరాబాద్‌కు, ఇతర మన పురాణా క్షేత్రాలను చూచుటకు వచ్చేటపుడు ఇందులో బస చేస్తారు. ఎందరో శ్రీమంతులు వేసవిలో ఇతర కాలంలో విశ్రాంతి కొరకు వస్తారు, సినిమా షూటింగ్‌లు ఇందులో జరుగుతవి. అందుకు కొంత డబ్బు వస్తుంది. కొబ్బరి, కర్పూర, ద్రాక్ష ఇతరుల ట్రాన్స్‌పోర్టుల వలన కొంత డబ్బు వస్తుంది."

"అలాగా....నిజంగా ఎంత సౌందర్యంగా వుంది ఈ ఎస్టేట్? ప్రశాంతంగా, స్వచ్ఛంగా వుంది." అంటూ, "అరే - అపుడే యింటివైపు మాటల్లోనే వచ్చామే!" ఆశ్చర్యంతో నిలబడి అన్నాడు వసంత్.

"ఓ. కె. సర్....వివిల్ మీట్ టుమారో, గుడ్ ఈవెనింగ్ అండ్ స్వీట్ డ్రీమ్స్." అంటూ విష్ చేసి వెళ్ళాడు రాఘవ్.

ఉల్లాసమైనన మనసుతో వెళ్ళి భోంచేసి బంగారుకలలు కంటూ నిద్రాదేవి ఒడిలో ఒదిగి పోయాడు.

* * *

"రావ్! ఎన్ని రోజులయిందిరా నిన్ను చూసి! సరే కాని, రేపు నీవు యిక్కడే మాతో హాయిగా ఉండొచ్చు కాదరా! ఆ రాజాగారి ఎస్టేట్‌లో ఎందుకు?"

"ఉందును. కాని డాక్టర్ నన్ను మంచి వాతావరణంలో, ప్రశాంతమైన-స్వచ్ఛమైన గాలి ఉన్న ప్రదేశంలో వుండమన్నాడు. అందుకే అక్కడ వుండను. నేను కాశ్మీరుకు వెళ్దాం అని అనుకున్నా. కాని, అక్కడ ఓవర్ స్నోవ్ వుంటుంది. మళ్ళీ మిమ్మలను చూడక చాల రోజులయింది. మీతో గడిపితే కొంచెం హాయిగా వుంటుందని వచ్చాను." అంటూ చెప్పాడు దశరథరావు.

"అవును. మా ఎస్టేట్ యొక్క పరువు తీయడం మంచిది కాదురా రామ్! ఇపుడు చూడు, మా మేనేజర్ వసంత్ డ్యూటీలో జాయిన్ అయి మూడు రోజులన్నా కాలేదు. ఎంత బాగా తీర్చి దిద్దాడు. అతను ఏవేవో క్రొత్త పథకాలు వేశాడు. దాదాపు యీ నెలలో మంచి ఆదాయముంటుంది కావచ్చు!" అని అన్న రాజశేఖరం మాటలు పూర్తికాకముందే దశరథరావు విని "మీ మేనేజర్ వసంత్ అంటే "

పూర్తి వాక్యం చేయకముందే రామ్‌లాల్ అందుకొని, "అవును. నీవు పంపినతనే - రాజశేఖర్ ఎస్టేట్ మేనేజర్. మంచి వ్యక్తి!" అని అన్నాడు.

"అయితే, ఇంకేమి వసంత్ దగ్గరే ఉంటాము కాబోలు." అన్న దశరథరావు మాటలను విని—

అప్పుడే మేడ మెట్లు దిగుతున్న పల్లవి, "వసంత్ అంటే...." అంటూ వాక్యం పూర్తిచేయక మునుపే—రావు అందుకొని "అదేనమ్మా మీ మాష్టారు!" అని అన్నాడు.

ఆ మాటలు వినగానే పల్లవి హృదయకుసుమాలు వెల్లి విరిసి పరిమళాలను వెదజల్లినట్లు అనందంతో ఊగింది.

"అయితే, వసంత్‌ను తను చూడబోతుందా? వసంత్ చెంతనే తాము వుండడమా?" అంటూ ఆలోచిస్తుంది.

ఆ సమయంలోనే వానవి వచ్చి పల్లవిని చూసి కొంచెం షాక్ తిన్నట్లయి, 'ఈమెను ఎక్కడో చూసాను!' అంటూ ఆలోచిస్తుంది.

"ఆఁ....అమ్మా వచ్చావా! అదుగో పల్లవి....మా దశరథరావుగారి ఏకైక గారాలపట్టీ ఆమెను పైకి తీసుకెళ్ళి అన్ని గదులు చూపించు."

"ఓ,కే. డాడీ....రండీ!" అంటూ తీసుకెళ్ళింది. కాని ఆమె మనస్సంతా ఆమె గురించే. 'ఏమిటి యీమెను ఎక్కడో చూశాను. అని ఇంతలో క్రిందివారు వసంత్ గూర్చి మాట్లాడుతుంటే జ్ఞాపకం వచ్చి "ఓహో....అయితే ఈమె అతని మొదటి ప్రియురాలు. వసంత్ ఎందుకో వీరిద్దరు భార్యా భర్తలు అవుతారు అని వాళ్ళ మేనమామ అన్నపుడు ముభావంగా వున్నాడు అంటే అతనికి యిష్టం లేదు అన్నట్లే కదా! ఇపుడు యీ పల్లవి కనిసిస్తే ఈమెను పెళ్ళి చేసుకొంటాను అంటాడు. అపుడు అతని జీవితం ఒక నందన వనం అవుతుంది. నో అలా కారాదు.



ఈమెకు అతనిపై ద్వేషాన్ని ప్రజ్వలింప చేయాలి. నాకు తోడుగా, అతనికి విరోధిగా మల్చాలి. వసంత్‌ను మాన సికంగా చిత్రహింసల పాలు చేయాలి. అపుడే ఆనందం!' అంటూ లోలోనే పరిపరి విధాల ఆలోచిస్తుంది. లోని కెళ్ళిన తరువాత ప్రథమంగా వాసవే ప్రసంగం మొదలు పెట్టింది.

"అవును పల్లవిగారూ! మీకు వసంత్ తెలుసా?"

'తెలుసు, చాల మంచివాడు"

"కాదు, నీచుడు....మూడు లక్షల రూపాయల ఆస్తి కొరకు ఒక స్త్రీని పెళ్ళి చేసుకుంటున్నాడు." వాసవి అంది కోపంగా.

ఆ మాట వినడంతోనే పల్లవి హృదయం పగిలిపోయి నట్లు బాధ చెందింది. "నో, అలా జరగదు! నీకెలా తెలుసు?" అని అడిగింది.

"నాకు తెలుసు నీవు నమ్మవని! ప్రేమించుకున్న వాళ్ళ ప్రథమ లక్షణం యిదే. మన స్త్రీలు అంతా అయిపోయిన తరువాత అపుడు బాధ పడతారు, ఇదుగో యీ ఫోటో చూడు. ఈమె అతని మేనమరదలు. పేరు రాగిని. ఆ ప్రక్కన వున్నాడే చూడు. అతను వసంత్ మేనమామ!" అంటూ చూపించింది.

ఆమె మాటలు పూర్తిగా నమ్మలేక దానిని అబద్ధం అని అనుకోలేక లోలోన కుములుతూ మంచంపై పడుకొని తల పిల్లోపై పెట్టి ఏడుస్తుంది పల్లవి.

"ఆఁ ...యిపుడు ఒక రసపట్టుకు వచ్చింది." అని సంతోషంతో ఆ ఫోటోలు అక్కడే వేసి వెళ్ళింది. వాసవి ఒక బాయ్‌ఫ్రెండ్ కిచ్చిన మాట కొరకు అతన్ని కలియుట కొరకు.

* * *

"చూడు మామయ్యా! నీ కూతురు ఎలా బుంగమూతి పెట్టిందో దేవిగారూ! క్షమించండి. ఇక యీ మూగ నోము చాలించండి. ఆకలి దంచేస్తుంది, వడ్డిస్తారా?" అంటూ చేయి పట్టి లాక్కొని వెళ్ళాడు వసంత్.

ఆ దృశ్యాన్ని జగన్నాథం చూసి ముసిముసి నవ్వులు నవ్వాడు. అదే దృశ్యాన్ని చూడలేక "నాన్నా! నీవు వెళ్ళిరా! నేను మన బంగళాకు వెళుతున్నాను. నీవు తర్వాత వారి జీపులో రా! లేకుంటే నేను తిరిగి కారును పంపిస్తాను." అని పల్లవి ఎదురు సమాధానం వినకుండా వెళ్ళి కారులో కూర్చుండి వెళ్ళిపోయింది,

పల్లవిని చూసి సంతోషంతో లేవబోయిన వసంత్ మళ్ళీ కూర్చుండి 'పల్లవి యీ దృశ్యాన్ని చూసి అపార్థం చేసుకుందా? అయ్యో భగవంతుడా! ఇది ఒక నాటకమని ఎలా చెప్పను? చెప్పినా వింటుందా? ఏమి అనుకున్నది ...? అక్కడ వాసవి నాగురించి ఏమి చెప్పిందో? సినిమా టాకీసులో మా ఫోటోలు తీసిందని మాకు చెప్పాడు. ఆ ఫోటోలను చూపించిందా? చూపిస్తే నమ్మి ఉండవచ్చు. అయినా సాయంత్రం వెళ్ళి వివరంగా చెబుతాను' అని లోలోన అనుకొని, అన్నంలో చేయి కడిగి లేచి "రండి - దశరథరావుగారూ!" అంటూ ఆహ్వానించాడు.

అంతలో జగన్నాథం వచ్చి జోకులు విసురుకుంటూ మాట్లాడుతున్నారు. కాని వసంత్ మనస్సంతా ఏదో-ఏదో ఆలోచిస్తుంది.

"ఆఁ....వసంత్ కారు వచ్చింది వెళ్ళి వస్తాను. రేపు ఒకసారి అలా రావోయ్!...." అంటూ లేచి వెళ్ళాడు దశరథరావుగారు.

అతని పిలుపుకు ఉలిక్కి పడి "సరేనండీ!" అంటూ సాగనంపాడు.

"నేను మాత్రం యిపుడే వస్తాను పద." అంటూ జగన్నాథం దశరథరావు వెంట వెళ్ళిపోయాడు.

కారు వెళ్ళిన శబ్దమిచ్చిన తదుపరి వసంత్ చెప్పులు తొడుక్కొని భారమైన హృదయంతో భారంగా తోటలోకి అడుగు వేశాడు.

పల్లవిని చూసిన క్షణం నుండి వసంత్ మొఖం అదోలా ఉండటం చూసింది రాగిని. వెళ్ళి వరండాలో వున్న వాలు కుర్చీలో కూర్చుంటూ రాత్రి వసంత్ చదివిన పుస్తకాన్ని అక్కడి టేబుల్‌పై ఉండటం చూసి వెళ్ళి దానిని అందు కున్నది. అందులోనుండి ఏవేవో కాగితాలు క్రింద పడ డంతో అవి తీసి చూసింది. ఆ కాగితాలు వసంత్ పల్లవికి వ్రాసిన ఉత్తరాలు. కాని వాటిని పోస్టు చేయలేదు.

"అంటే పల్లవిని బావ ప్రేమించాడా? కావచ్చు.... పల్లవి మొదట చూడగా అతని మొఖం వికసించింది. తరువాత ఆమె వెళ్ళిపోవడంతో ముడుచుకున్నది. ఇందుకే కాబోలు - మా ఫోటోలు వాసవి తీసిందని నాన్న చెప్పాడు. ఒకవేళ అవి పల్లవి చూసిందా? నాన్న సంతోషం కొరకు నన్ను అపుడపుడు చిలిపిగా చూస్తూ, కొంటె పనులు చేస్తాడా? ఒకవేళ యిప్పటి నటఘటనను చూసిందా? ఏది ఏమైనా బావకు కష్టం కలిగిస్తున్నాను. భగవాన్! ఎంత వరకు నీ పరీక్ష? తొందరగా అంతం చేయు స్వామీ!' అని తలపోస్తూ, విలపిస్తూ అలాగే నిదురపోయింది రాగిని.

* * *

"పల్లవీ....నా మాట విను ప్లీజ్!"

"లేదు. నేను వినను. నాకు అవసరం లేదు. ఇక్కడి నుండి వెళ్ళిపోండి." అంటూ లోలోన కుములుతున్నది పల్లవి.

"ఎలా వెళ్ళిపొమ్మంటావు పల్లవీ....ఎలా పొమ్మంటావు? ప్రేమ అనేది తెలియని తొలి రోజులలో నాలో ప్రేమ బీటలను నాటావు. అది వృక్షమై - అనేక శాఖలలో విస్తరించి నా అణువణువులలో నిండి పోయావు....ఆ వృక్షాన్ని ఇపుడు పీకివేయడం సాధ్యమనుకుంటున్నావా?" సాధ్యమనుకుంటున్నావా?" అంటూ ముందుకు రాబోయాడు వసంత్.

"వసంత్! ఈ ప్రసంగమంతా ఆపు....వెళ్ళు నన్ను విడిచి."

"పల్లవీ! నిన్ను విడిచిన ఈ బంధాన్ని విడుస్తానా.... నీవే ఈ బంధాన్ని వేశావు. ఎలా తెంపుకోమంటావు?" అంటూ ఉంగరాన్ని చూపించాడు వసంత్.

అతని విన్నపాలు వినకుండా ఆమె మెడలోనున్న గొలుసును తీసి "ఇదుగో మీ భార్యామణికి యిచ్చుకోండి!" అంటూ అతనిపై పారేసింది పల్లవి.

"పల్లవీ! ఆనాడు నేను నీకు భర్తను; నీవు నాకు భార్యవని అన్నావు. ఇక నాకు వేరే భార్య ఎందుకు? అయినా నేను చెప్పేది పూర్తిగా విను." అంటూ ప్రాధేయపడ్డాడు వసంత్.

"అవన్నీ సినిమా డైలాగులు....చెప్పి విసిగించకండి. మోసపోయాను. మీ తెచ్చిపెట్టుకున్న ప్రవర్తనను చూసి, అందం చూసి మోసపోయాను ఊఁ - మా నాన్ననే మోసపోయాడు....మీ మంచి ప్రవర్తన చూసి తన అల్లుడిగా చేసుకొని బాధ్యతలన్నీ అప్పచెప్పాలని కలలు కన్నాడు. నేను ఈ కపటప్రేమ గురించి చెప్పితే సంతోషంతో ఒప్పుకున్నాడు. అతనే నమ్మి మోసపోయిన తరువాత ఇక నేనెంత? మంచిగా యాక్ట్ చేస్తారు మీరు. ఛీ....మొగాళ్ళను నమ్మొద్దు! నమ్మించి గొంతు కోస్తారు. డబ్బు కొరకు కన్న తల్లినైనా వ్యభిచారానికి పంపే ధూర్తులు మీలాగ!" అసహ్యంగా అంది పల్లవి.

"ఏమన్నావ్....కన్న తల్లిని డబ్బు కొరకు నేను వేరే వానిదగ్గర పడుకోబెట్టానా? ఛీ-ఛీ....నీ పాడుబుద్ధిని పోనిచ్చావు కాదు." అని పల్లవి చెంపపైన చెఢేల్‌మని దెబ్బ కొట్టి గబగబా వెళ్ళిపోయాడు.




ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనో బ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

—— వివరములకు ——

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works : 2275

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002

SALES BRANCHES :–

112, Zeera, Secunderabad - 3.

13/85, Jayachamarajendra Road, Bangalore - 2.

10, Municipal Market Building, Kokkalai, Trichur - 1.

పల్లవి ఏడుస్తూ తలగడలో మొఖాన్ని దాచుకుంది. వసంత్ నడుస్తూ 'ఛీ....ఎంత తొందర పడ్డాను? ఏదో విన్నదానిని బట్టి అలా మాట్లాడింది అంతే ...పాపం ఎంత ఏడుస్తుందో....అయినా నేను నిజం చెప్పబోయి చెంప దెబ్బ కొట్టాను!' అని అనుకొని, మళ్ళీ పల్లవి గదికి వెళ్ళి ఏదో చెప్పబోయాడు.

"దయచేసి వెళ్ళండి. ఇంకో చెంప బాకీ ఉన్నదని వచ్చారా? వెళ్ళండి ... లేకుంటే నా శవాన్నే కళ్ళారా చూస్తారు!" అని రోషంతో వెళ్ళి తలుపు దభాలున వేసి లోలోనే విలపించింది పల్లవి.

ఇక చేసేది లేక దేవునిపై భారం వేసి భారంగా నడిచాడు వసంత్.

* * *

"ఆఁ ...కుమార్ ఆక్సిడెంట్‌లో చనిపోయాడా?" పొట్లాలలో వచ్చిన పాత పేపరులోని ఫొటోను, దాని క్రింది భాగంలో గల వాక్యాలను చదివి రాగిని ఏడుస్తూ 'నా మొఖాన్ని ఎలా చూపించను బావకు? అతను ప్రేమించిన ప్రేయసిని నేను దూరం చేసి - అతనికి మనశ్శాంతిని లేకుండా చేసిన పాపాత్మురాలను!... కుమార్ వస్తాడు - నన్ను ఏలుకుంటాడు అని వూహించి, ఇటు నా జీవితాన్ని, అమాయకుడైన బావ జీవితాన్ని నాశనం చేశాను కదా ... మొన్న వచ్చిన వాంతుల ప్రకారం నాకు గర్భం ఉంది. కుమార్ ప్రతి రూపం పెరుగుతుంది. ఈ విధమైన సంగతి బావ-అని నేను ఎలా చెప్పను? ఇవి అన్నీ చెప్పకుండా వుండటమే ఒకే ఒక మార్గం వుంది!....' అంటూ లేచి టిక్ట్వంటీని త్రాగి మైకంతో పడిపోయింది.

అపుడే లోని కొచ్చిన వసంత్ పడిపోతున్న రాగిన్ని చూసి ఆమె ప్రక్కనున్న పేపరులో 'పై ఫొటోలో ఉన్న వ్యక్తి నేడు నాలుగు గంటలు సాయంత్రం కారు యాక్సిడెంట్‌లో మరణించాడు. కావున ఇతని బంధువులు కాని, ఎవరైనా తెలిసినవారు కాని ఈ క్రింది అడ్రసుకు సంప్రదించ గలరు' అని ఆంగ్లంలో ఉన్న విషయాన్ని చదివి 'రాగినీ! ఎంత తొందర పని చేశావు' అని అనుకొని త్వర-త్వరగా గుమ్మంలో ఎదురైన మామతో క్లుప్తంగా చెప్పి హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు.

దడ-దడ మనే గుండెలతో సమాచారం కొరకు అటు-ఇటు తిరుగుతున్న వసంత్, జగన్నాధం అపుడే బయటికి వస్తున్న డాక్టర్‌ను చూసి "డాక్టర్! ఆమెకు ఏమయింది?" అని గాబరాతో అడిగాడు.

"షీ ఈజ్ ఆల్‌రైట్ కొంచెం ఆలస్యమైతే కష్టమయ్యేది. కాని ప్రస్తుతం బాగానే వుంది. కాని ఆమె గర్భం విచ్చిన్నమయింది. అయాం సారీ, చాల ప్రయత్నించాము. వెళ్ళి చూడొచ్చు!" అంటూ వెళ్ళిపోయాడు డాక్టర్.

"థాంక్స్ డాక్టర్!" అని లోనికి వెళ్ళాడు వసంత్.

అతన్ని అనుసరించాడు జగన్నాధం.

"అమ్మా!" అంటూ భోరున ఏడుస్తూ జగన్నాధం రాగినిపై పడ్డాడు.

"రాగినీ! నీకు గర్భం అని తెలిసి ఈ పని చేశావా?.... కుమార్ లేడని ఈ పని చేశావా? కాని ఈ బావ నీకు లేడా రాగినీ! నేను చనిపోయాననుకున్నావా?" అంటూ ఏడుస్తూ మళ్ళీ "రాగినీ! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను!" అని దృఢంగా అన్నాడు వసంత్.

"బావా....మరి పల్లవి?"

"ఛీ ఆమె ఒక మూర్ఖురాలు! చెప్పింది వినదు. ఎవరో ఏదో చెప్పారని ఏదో అనుకుంటుంది. అయినా ఇంత రత్నరాశివి నీవు చెంత వుండగా యిక వేరే వారెందుకు చెప్పు? నేను నిన్ను తప్ప వేరే వారి నెవరిని చేసుకోను?" అంటూ శూన్యంలోకి చూశాడు వసంత్.

అతని వైపు తిరిగి "బావా!...." అని అవ్యక్తమైన ఆనందం, బాధ నిండిన హృదయంతో వసంత్ వైపే చూస్తున్నది రాగిని.

"బాబూ! నా డైరీలో నీ లాంటి వ్యక్తిని చూడ్డం ఇదే మొదటిసారి బాబూ!" అంటూ చెమ్మగిల్లిన కళ్ళతో కృతజ్ఞతలు తెలిపాడు జగన్నాధం.

* * *

"డాక్టర్ .. ఇది నిజమా?"! ఆందోళనతో అడిగింది తనకు సిప్లిస్ అని తెలిసికొని.

"అవును వాసవీ! ఇదొక భయంకరమైన వ్యాధి.... దీన్ని మొదటనే తెలిసికొని ట్రీట్‌మెంట్ చేయాలి. కాని ఇది చాల ముదిరి పోయింది. దీనిని మంచిగా చేయడం చాల కష్టం. సారీ....ఆ భగవంతుడే రక్షించాలి. ఒక్కొక్కప్పుడు మేమే గొప్పని అనుకుంటాము. కాని మా అందరికన్నా మిన్న ఆ దేవుడే! నీ రక్త కణాలలో ఈ వ్యాధి నిండి పోయింది. నేను చేసేది చెప్తాను....చేశాను కూడా! కాని ఫలితం శూన్యం. ఇక ఆ భగవంతునికే నీ భారం వదిలేయాలి." అంటూ లేచి వెళ్ళింది డాక్టర్.

"డాక్టర్!" అంటూ బాధతో కుమిలి-కుమిలి ఏడ్చింది వాసవి.

(సశేషం)